క్లుప్తంగా

వినుకొండ వైద్య విద్యార్థికి బంగారు పతకం


డాక్టర్ జి.జయహరీష్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన డాక్టర్ జి.జయహరీష్ వైద్య విద్యలో ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించారు. పాండిచ్చేరిలోని జిప్‌మార్ మెడికల్ కళాశాలలో ఎండీ జనరల్ మెడిసిన్ చివరి సంవత్సరం చదువుతున్న జయహరీష్ ఇండియన్ ఫిజీషియన్ అసోసియేషన్ తమిళనాడు విభాగం నుంచి క్లినికల్ ఎక్సలెన్స్‌లో డాక్టర్ ఎ.మురగనాథన్ నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. తిరునల్వేలిలో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో ప్రశంసాపత్రం, బంగారు పతకం అందజేశారు. బంగారు పతకం సాధించిన డాక్టర్ జయహరీష్‌ను, తల్లిదండ్రులు నరసింహారావు, వరలక్ష్మిలను పలువురు అభినందించారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు చేయూత



చిలకలూరిపేటటౌన్: ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆవోపా ఏపీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని సంఘ అధ్యక్షుడు గార్లపాటి సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఆర్యవైశ్య విద్యానిధి కార్యదర్శి మాజేటి నరేంద్ర కుమారుడు చక్రవర్తి రూ.50వేలను ఎడ్యుకేషనల్ ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. సంఘ ప్రధాన కార్యదర్శి పొట్టి శ్రీరాములు, కోశాధికారి చింతా కృష్ణారావు, సభ్యులు సామా శ్రీనివాస్, కొలిశెట్టి శరత్, ఎం.నాగేశ్వరరావు, మాజేటి చక్రవర్తి పాల్గొన్నారు.

నిత్యావసరాలు, చీరలు అందజేత



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు ఆఫీస్‌లో 8మంది పేద బ్రాహ్మణులకు బియ్యం, నిత్యావసర సరుకులు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన సత్తెనపల్లికి చెందిన ఏపీ బీఎస్ఎస్ అధికార ప్రతినిధి కోనంకి మారుతి, నరసరావుపేట పురోహిత సంఘం పూర్వ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశాస్త్రిలు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు ఏకా మారుతి రామశర్మ, సీహెచ్ రాఘవేంద్రరావు, శిష్టా శ్రీశైల మల్లికార్జునశాస్త్రి, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, భాగవతుల రవికుమార్, చంద్రమౌళేశ్వర శాస్త్రి, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం వైపు మళ్లాలి



యడ్లపాడు(నాదెండ్ల): ప్రజల హితం కోరి భగవద్గీతను అందించిన శ్రీకృష్ణ భగవానుడే నిజమైన స్నేహితుడని త్రైత సిద్ధాంతం, ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు రాజీవ్‌గాంధీ సెంటర్‌లో త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వ సృష్టిని సృష్టించిన భగవంతుడు ఒక్కడేనని, ప్రతి యుగంలో ఎందరో మహనీయులు భగవంతుడి ఏకత్వాన్ని చాటారన్నారు. ప్రజలు త్రైత సిద్ధాంతం వైపు మళ్లాలని కోరారు. సభ్యులు అరుణ, కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపీ, శ్రీను, వీరయ్య, వెంకటలక్ష్మి, అనురాధ, రాఘవ, అమర్, చిరంజీవి, అనంతలక్ష్మి, శివ పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో 'నా భూమి - నా దేశం'

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు, సంకురాత్రిపాడు, నాదెండ్ల గ్రామాల్లో సోమవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జాకీర్ హుస్సేన్ తెలిపారు. నాదెండ్లలో జరిగే కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు హాజరవుతారన్నారు. గ్రామాల్లో శిలాఫలకాల ఆవిష్కరణ, జాతీయ పతాకావిష్కరణ, అమరవీరుల సంస్మరణ, మొక్కలు నాటడం, ప్రతిజ్ఞ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది హాజరుకావాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- శరవేగంగా అభివృద్ధి పనులు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


సుబ్బయ్యపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా వేగంగా నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుబ్బయ్యపాలెంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామంలో 990మంది జనాభా ఉండగా రూ.4.75కోట్లమేర సంక్షేమం అందించామన్నారు. గడప గడపకు కార్యక్రమంలో రూ.10లక్షలు, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి మరో రూ.20లక్షలు కేటాయించి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడతామన్నారు. అలాగే డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించి వారికి అందుతున్న రాయితీలు, రుణాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సున్నావడ్డీ పథకంతో సీ, డీ గ్రేడులో ఉన్న గ్రూపులన్నీ ఏబీ గ్రేడుల్లోకి వచ్చాయన్నారు. ఒక్కో గ్రూపునకు రూ.10లక్షలు నుంచి రూ.20లక్షల మేర రుణాలు అందజేస్తున్నామన్నారు. వారు పొందిన రుణాలతో చేస్తున్న వ్యాపారాలు అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు తగవని పవన్ కల్యాణ్‌కు సూచించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, వలంటీర్లు అందిస్తున్న సేవలను గురించి విచారించటంతో పాటు అర్హులైన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకటరావు, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వట్టికుంట ఆంజనేయులు, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి గానుగపంట ఉత్తమరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, సర్పంచి గాడిపర్తి స్వరాజ్యం, ఉప సర్పంచి సీతయ్య, బండి సుబ్బారావు, జాష్టి రామారావు, గుండాల వెంకటేష్, ముంద్రు హరినారాయణ, మానుకొండ వాసుదేవరెడ్డి, పడాల చక్రారెడ్డి, పమ్మి కోటిరెడ్డి, పొనుగోటి వెంకటరావు, గాజుల మాణిక్యం, కల్లి వెంకటరెడ్డి, కంచేటి రామారావు, అధికారులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


లూథరన్ చర్చి నిర్మాణ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: ప్రభువు చూపిన ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణాలను అందరూ ఆచరించాలని, రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో రూ.25 లక్షల నిధులతో చేపట్టిన లూథరన్ చర్చికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సెవెన్త్‌డే చర్చి, లూథరన్ చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. చర్చి నిర్మాణానికి గడపగడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.10 లక్షలు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. చర్చి నిర్మాణం పూర్తి అయిన తర్వాత అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే సెవెన్త్‌డే చర్చి కాంపౌండ్ నిర్మాణానికి రూ.7 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రైతులు, రైతు కూలీలు పొలాలకు వెళ్లేందుకు అవసరమైన కాల్వగట్టు రహదారిని రూ.4 లక్షల వ్యయంతో విస్తరిస్తామన్నారు. చర్చి నిర్మాణాన్ని వెంటనే చేపట్టి పూర్తిచేయిస్తామన్నారు. రాష్ట్ర ప్రజల క్షేమాలను కోరే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని సేవలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గ్రామంలోని కాలనీలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గుండాల వెంకటేష్, చపారపు సంజీవరెడ్డి, సర్పంచ్ సిద్దెల కోటమ్మ, ఏసుపాదం, కామినేని ఆదెయ్య, నాయకులు బొబ్బిలి కోటిరెడ్డి, మాదిరెడ్డి బాలకోటిరెడ్డి, ఏరువ శ్రీనివాసరెడ్డి, బండి రఘుపతిరావు, కేసరి వెంకటేశ్వరరెడ్డి, కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వర్లు, సానికొమ్ము కోటిరెడ్డి, డి.చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ దొడ్డా కరుణమ్మ, ముచ్చుమారి వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

- వేల్పూరులో రూ.4 కోట్ల వ్యయంతో..
- తీరనున్న విద్యుత్ వెతలు


సన్ పోల్స్ నిర్మాణ పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు వద్ద రూ.4 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యంతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషను పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పనులు పూర్తి అయితే పూర్తి స్థాయిలో అనధికార విద్యుత్ కోతలు నియంత్రణతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. దీనికితోడు మండలంలోని కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో అదనపు లోడు భారం కూడా తగ్గుతుంది. భవిష్యత్‌లో విద్యుత్ అంతరాయాలు వాటిల్లితే ప్రత్యామ్నాయంగా వేల్పూరు నూతన విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో నుంచి మిగిలిన గ్రామాల్లోకి విద్యుత్ సరఫరా ఇచ్చేలా కసరత్తు చేస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషను పరిధిలో 5 వేల నివాస గృహాలకు అధికారికంగా విద్యుత్ సరఫరాతో పాటు 1500 వ్యవసాయ విద్యుత్ మోటర్లకు సరఫరా చేసే ఆధునిక సామర్థ్యం కలిగిన యంత్ర పరికరాలు అమర్చుతున్నారు. వేల్పూరు గ్రామంలో విద్యుత్ మీటర్లు- 2 వేలు వెలమవారిపాలెం-200, గంటావారిపాలెం -460, పోట్లూరు-1100, బొగ్గరం-900 విద్యుత్ మీటర్లు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి.

విద్యుత్ కష్టాలు తీరనున్నాయి



స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో వేల్పూరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషను ఏర్పాటు చేయటం మంచి శుభపరిణామం. దీని వల్ల విద్యుత్ కోతల నియంత్రణతో పాటు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సబ్‌స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తుండటం అభినందనీయం.
–వద్రాణం నాగేశ్వరరావు, గంటావారిపాలెం

పారదర్శకంగా పనులు



నూతన విద్యుత్ సబ్‌స్టేషను నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి. గంటావారిపాలెం గ్రామసమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధి నుంచి సబ్ స్టేషను వరకు 45 విద్యుత్ స్తంభాలు నిర్మాణ పనులు పూర్తి కాగానే, 5 ఎంవీ వాట్స్ విద్యుత్ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్) బ్రేకప్ పనులు చేస్తాం.
–నంపెంగుల గాంధీ, మండల విద్యుత్ శాఖాధికారి

ఆరోగ్యమిత్రల వేతనాలు పెంచాలి

వినుకొండ(నూజెండ్ల): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల జీతాలను పెంచి వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సమైక్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఆరోగ్యమిత్రలుగా పనిచేస్తున్నామని, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, జీతాలకు సంబంధించిన ఫైల్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య మిత్రలకు ప్రమోషన్లు కల్పించాలని, 35 సెలవులతో కూడిన స్పెషల్ లీవులు మంజూరు చేయాలని, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు కూడా ఇన్సెంటివ్స్ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకాని అప్పారావు, ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి జడ్డా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల గొంతుక గద్దర్

ఘన నివాళి అర్పించిన ప్రజాసంఘాల నాయకులు


సంతాప సభలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పీడిత ప్రజల గొంతుకై నినదించిన ప్రజాగాయకుడు గద్దర్ అని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం గద్దర్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీర్ ఆలీ ఖాన్ సంతాప సభను పౌరహక్కుల సంఘ నాయకుడు శిఖినం చిన్నా అధ్యక్షతన నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గద్దర్ దళితుడిగా పుట్టి అనేక వివక్షతలకు గురై, విప్లవ పార్టీలో కొంతకాలం పనిచేసి బహిరంగ ప్రజాసమూహంలో పేద ప్రజల గొంతుకై ఆడిపాడి ప్రజా గాయకుడిగా పేరుగాంచారన్నారు. జహీర్ ఆలీఖాన్ తాను నమ్మిన సిద్ధాంతం కోసం తాను మరణించేంతవరకు నిలబడ్డారని కొనియాడారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ గద్దర్ అనేక నిర్బంధాలను ఎదుర్కొని నిలబడ్డారని, అతని ఆశయాల బాటలో నడవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, ప్రజాకళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాణి, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తనాళాల పరీక్ష


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, లయన్స్ మహిళా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ జోన్ చైర్మన్ నక్కా కోటేశ్వరమ్మ మాట్లాడుతూ రక్తనాళాల వైద్య పరీక్షలు హాస్పటల్‌లో చేయించుకుంటే ఎంతో వ్యయంతో కూడినవని చెప్పారు. ఈ పరీక్షలను లయన్స్ క్లబ్ ఉచితంగా అందించిందని చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలను ఏషియన్ వ్యాస్కులర్ హాస్పటల్ డాక్టర్ శ్రీ అనిల్, శ్రీప్రమోద నిర్వహించారు. 150 మందిని పరీక్షించారు. క్లబ్ అధ్యక్షుడు రావికింది మణి, చుక్కా విన్సెంట్ పాల్, పోలిశెట్టి నాగేశ్వరరావు, యక్కల దేవేంద్ర రాజేష్, లీలారాణి, వినుకొండ జయలక్ష్మి పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆలయ ఈఓ సుధాకరరెడ్డికి చెక్కు అందజేస్తున్న భక్తులు

నరసరావుపేట రూరల్: ఇసప్పాలెంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణంకోసం సత్తెనపల్లికి చెందిన ఈశ్వర్ రైస్ ట్రేడర్స్ అధిపతి దేవత రామజోగి, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారి టి.సుధాకరరెడ్డికి చెక్కు అందజేశారు. దేవస్థానానికి విరాళం ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు లభిస్తుందని ఈఓ తెలిపారు.

750 మందికి కంటి పరీక్షలు

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు ప్రాథమికోన్నత పాఠశాలలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించిన శిబిరంలో సుమారు 17 మంది వైద్య బృందం 750 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. వీరిలో 245 మందికి కంట్లో శుక్లాలు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్లకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17 నుంచి వివిధ దశల్లో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్య బృందం తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత నాదెండ్ల సొసైటీ చైర్మన్ కురుకుంట్ల వెంకటరెడ్డి, సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు విడదల గోపీనాథ్, ఎంపీటీసీ గేరా సుహాసిని, నాయకులు భవనం రఘురామిరెడ్డి, చల్లా పుల్లారెడ్డి, నాగిరెడ్డి, ఓగిరాల రామిరెడ్డి, బోయినపల్లి రాజా, ఈవూరి అంజిరెడ్డి, సుందరరెడ్డి, డీలర్ సూరారెడ్డి, కంజుల కొండారెడ్డి, ఏనుమల సూరారెడ్డి ఉన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

నరసరావుపేట టౌన్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామిరెడ్డిపేటకు చెందిన మారెపల్లి నవీన్(38) ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం మారుతి కుమారిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు, సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'గడప గడపకు' నిధులతో అభివృద్ధి పనులు

శావల్యాపురం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో గడప-గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఒక్కో గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకొని అనంతరం సచివాలయాల వారీగా ప్రభుత్వం విడుదలచేసిన నిధులతో ఆయా గ్రామాల్లోని సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలోని కారుమంచి గ్రామ సచివాలయంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామని, త్వరలో రూ. 20 లక్షల ప్రభుత్వ నిధులు విడుదల అవుతాయన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీలో రెండు సచివాలయ పరిధిలో రూ.40లక్షల నిధులతో 540 మీటర్ల మేర నూతనంగా సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు.

పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన సర్పంచుల బృందం



సత్తెనపల్లి: పులిచింత ప్రాజెక్ట్‌ను పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట మండలం మాదిపాడు సత్తెమ్మతల్లి దర్శనానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు ఆదివారం సందర్శించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు, సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ, ఈసాల నేతృత్వంలో ప్రాజెక్ట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి, కొరివి అనిల్ కుమార్, తొరటి తిరుపతయ్య, ఏడుకొండలు, గుంజి విజయకుమార్ పాల్గొన్నారు.

సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ప్రెసిడెంట్‌గా సురేష్ కుమార్

సత్తెనపల్లి: సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ప్రెసిడెంట్‌గా బలిజేపల్లి సురేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని 8వ వార్డు క్రిస్టియన్ పేటలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. సెక్రటరీగా కాకిజాలయ్య, ట్రెజరర్‌గా గుజ్జర్లపూడి రూబేను, వైస్ ప్రెసిడెంట్‌గా జొన్నలగడ్డ హుసేన్, వైస్ సెక్రటరీగా గంధం మోజెస్, వైస్ ట్రెజరర్‌గా నందిగం వెంకయ్య, కమిటీ మెంబర్లగా గుజ్జర్లపూడి రోజిబాబు, కోట దేవరాజ్, గుజ్జర్లపూడి సాగర్, కొత్తపల్లి రవికుమార్, గుజ్జర్లపూడి యేసేబు, గుజ్జర్లపూడి దినకర బాబు, గుజ్జర్లపూడి అనిల్ కుమార్, చింతపల్లి అజయకుమార్, దేవరకొండ ఏసురత్నం, పేరు పోగు శ్యాంబాబు లను ఎన్నుకున్నారు.

జిల్లా స్థాయి వీవీ అబాకస్‌లో రెడ్డి కృష్ణ ప్రతిభ



సత్తెనపల్లి: జిల్లా స్థాయి వీవీ అబాకస్‌లో సత్తెనపల్లికి చెందిన రెడ్డి కృష్ణ ప్రతిభ కనబరిచాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో వీవీ అబాకస్(గణిత శాస్త్రంలో) జిల్లా స్థాయిలో చాంపియన్ షిప్ ఒకటో ర్యాంక్, రెండో ర్యాంక్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీలలో సత్తెనపల్లికి చెందిన రెడ్డి కృష్ణ వికాస్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నాడు. చాంపియన్ షిప్ గెలిచిన విద్యార్థికి వీవీ అబాకస్ జిల్లా డైరెక్టర్ వి.శివశేఖర్, జిల్లా ఇన్‌చార్జి శివ నాగేంద్రం మెడల్ ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేశారు.

డెంగీ లక్షణాలతో బాలుడు మృతి



పెదకూరపాడు: డెంగీ లక్షణాలతో బాలుడు మృతి చెందిన ఘటన కన్నెగండ్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. తండ్రి సురేష్ తెలిపిన వివరాలు... నాలుగు రోజుల కిత్రం గ్రామానికి చెందిన గోగులపాటి యశ్వంత్(15) తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. వాంతులు, విరేచనాలు అధికం కావడంతో గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు గత బుధవారం తరలించారు. అక్కడ వైద్యులు డెంగీగా నిర్ధారించినట్లు వివరించారు. మృతుడి మతిస్థిమితం లేకపోవడంతో వ్యాధి గుర్తించలేకపోయినట్లు చెప్పారు. అక్కడ నుంచి జీజీహెచ్‌కి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ యశ్వంత్ మృతి చెందాడు. యశ్వంత్ మృతి వార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జిల్లా పార్టీ కార్యదర్శ కంకణాల శివాజీ, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పంద్రాగస్టు వేడుకలకు ఎస్ఎస్అండ్ఎన్ విద్యార్థి


అద్దంకి విజయకుమార్

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ అద్దంకి విజయకుమార్ విజయవాడలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ కవాతులో పాల్గొనేందుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పంద్రాగస్టు వేడుకల కవాతులో తమ విద్యార్థి పాల్గొనటం తమకు గర్వకారణమని తెలిపారు. విజయకుమార్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి అప్పారావు, అధ్యాపకులు అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com